
# నేడు గ్రూప్-4

- జిల్లా వ్యాప్తంగా 80 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 25,980 మంది అభ్యర్థులు


సిద్దిపేట ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో నెంబర్లు వేస్తున్న అధికారులు, సిబ్బంది


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, జూన్ 30: జిల్లా వ్యాప్తంగా శనివారం జరగనున్న గ్రూప్-4 పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరగనున్నది. సిద్దిపేట పట్టణంలో 36 పరీక్షా కేంద్రాలు, గజ్వేల్‌లో 14, హుస్నాబాద్‌లో 8, దుబ్బాకలో 6, చిన్నకోడూరులో 3, జగదేవపూర్‌లో 1, బెజ్జంకిలో 2, చేర్యాలలో 4, కొండపాకలో 5, కుకునూరుపల్లిలో 1 మొత్తం 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 80 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 25,980 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### పకడ్బందీగా నిర్వహించాలి

- ఉదయం 9:45కు గేట్లు మూసివేయాలి
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, జూన్ 30 : గ్రూప్-4 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రూప్-4 నిర్వహణపై పరీక్షా కేంద్రాల లైజన్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ బోర్డు వెలువరించిన మార్గదర్శకాలను చదువుతూ అధికారులకు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-4 పరీక్షకు సంబంధించి రెండు పేపర్లకు వేర్వేరు రంగుల్లో డిజైన్ చేసిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రతిగదిని తనిఖీ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలో సిబ్బంది దగ్గర మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ గడియారం ఉండకుండా చూసుకోవాలన్నారు. అభ్యర్థులను ఉదయం 8 గంటల నుంచి బయోమెట్రిక్ అయిన తర్వాత లోనికి పంపాలని, ఉదయం 9:45 గంటలకే గేటు మూసివేయాలన్నారు. ఆర్టీసీ వాహనాలను సరిపడా నడపాలని రవాణాశాఖ అధికారులకు సూచించారు. సమస్యాత్మక సెంటర్లల్లో పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో లక్ష్మీ కిరణ్, జిల్లా రవాణాశాఖ అధికారి దుర్గాప్రసాద్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు

# సర్కారు బడులకు ట్యాబ్‌లు

- జిల్లాలో 630 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు లబ్ధి
- పాఠశాలల సమగ్ర సమాచారం ట్యాబ్‌లోనే..
- వివరాల నమోదుతోపాటు డిజిటల్ విద్యాబోధనకు ఉపయోగం
- ఇప్పటికే పంపిణీ ప్రక్రియ పూర్తిచేసిన అధికారులు

సిద్దిపేట అర్బన్, జూన్ 30 : సర్కారు పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. ఓ వైపు 'మనఊరు-మనబడి' కార్యక్రమంతో సకల సౌకర్యాలు కల్పిస్తూనే, మరోవైపు పాఠశాలకు సంబంధించిన సమాచారాన్ని పొందుపర్చేలా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నది. గతంలో పాఠశాల సమాచారాన్ని ఆన్‌లైన్ చేయాలంటే కాంప్లెక్స్, నెట్ సెంటర్లకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారడంతో వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు అన్ని పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. సమాచారాన్ని పొందుపర్చడమే కాకుండా డిజిటల్ విద్యాబోధనకు సైతం ఈ ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

### పాఠశాల సమగ్ర సమాచారం ట్యాబ్‌లోనే..

జిల్లాలో ఉన్న 630 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేసింది. ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చడం ఉపాధ్యాయులకు కొంత ఇబ్బందిగా ఉండేది. అయితే ఇక నుంచి పాఠశాలకు సంబంధించిన పలు అంశాలను ట్యాబ్‌లోనే పొందుపర్చనున్నారు. విద్యార్థుల అడ్మిషన్లు, విద్యార్థి సంబంధించిన పూర్తి బయోడేటా, యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, విద్యార్థుల హాజరుశాతం, ఉపాధ్యాయుల హాజరుశాతం, మార్కుల లిస్ట్, నెలవారీ పాఠశాల పనిదినాలు, యూడైస్ వివరాలు, మధ్యాహ్న భోజనం సంబంధించిన వివరాలు, మౌలిక వసతులు, విద్యాశాఖ అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలు, తదితర విషయాలన్నింటినీ ఇక నుంచి ట్యాబ్‌లోనే ఆన్‌లైన్ చేయనున్నారు. నంగునూరు మండలంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలో మండల వనరుల కేంద్రం కోఆర్డినేటర్ రజిత, సీఆర్పీ మోహన్‌బాబుతో కలిసి జేపీ తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణతో పాటు పలువురికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

# బస్టాండ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

**ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్, జూన్ 30: ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా పనులు చేపడుతున్నారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రూ.3.81కోట్లతో చేపడుతున్న బస్టాండ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషితో గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో బస్టాండ్లను నిర్మించుకునే అవకాశం వచ్చిందన్నారు. కోట్లాది రూపాయల నిధులతో గజ్వేల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. రాష్ట్రంలోనే గజ్వేల్ అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలవడం సంతోషంగా ఉందని, అన్ని రంగాల్లో గజ్వేల్‌ను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.


ప్రజ్ఞాపూర్‌లో బస్టాండ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలి

- పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత
- ఆపరేషన్ ముస్కాన్-8 నిర్వహణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేట అర్బన్, జూన్ 30: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. శనివారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణపై సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏండ్లలోపు ఉండి బాలకార్మికులుగా గొర్లు, పశువుల కాపర్లుగా, కిరాణం, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీఫామ్‌ల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం లేదా స్టేట్ హోమ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. పిల్లలతో ఎవరైనా భిక్షాటన, వెట్టిచాకిరీ చేయించినా క్రిమినల్ కేసులు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకునే విధంగా ప్రతి డివిజన్ పరిధిలో ఎస్సై, నలుగురు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. వీరితో పాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో దాడులు నిర్వహించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమష్టిగా ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించాలన్నారు. బడీడు పిల్లలు బడిలో ఉండాలన్నారు. పిల్లలు వెట్టిచాకిరీకి గురికాకుండా వారి ముఖంలో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. అలాంటి వారిని ఎవరైనా గుర్తిస్తే 1098, డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 8712667100, ఉమెన్ సేఫ్టీ వింగ్, హైదరాబాద్ 9440700906 నెంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అధికారులతో సీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీవో రాము, సీడబ్ల్యూసీ చైర్మన్ రాజలింగం, ఆపరేషన్ ముస్కాన్ సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట టౌన్ జూన్ 30 : రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతోపాటుగా భోజన, హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థులు ఈనెల 2 వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ tsstudycircle.co/in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 9న ప్రవేశ పరీక్ష ఉదయం 10:30 గంటలకు నుంచి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు ఉంటుందని చెప్పారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ, బాలికలు, బాలురులకు వేర్వేరుగా హాస్టల్ భవనాలు, 200 మంది కూర్చునే వీలున్న భోజనశాల ఇలా తదితర వసతులను కల్పిస్తున్నామన్నారు. ఏడాదిపాటు సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ప్రిలిమినరీ పాస్ అయిన అభ్యర్థులకు మెయిన్స్, ఇంటర్వ్యూ కోసం ప్రత్యేకంగా శిక్షణ అందిస్తామన్నారు. ప్రభుత్వమే అన్నీ ఖర్చులను భరిస్తున్నదన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అభ్యర్థులు అందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# మనస్తాపంతో యాసిడ్ తాగిన విద్యార్థిని

సిద్దిపేట అర్బన్, జూన్ 30 : ఎనిమిదో తరగతి విద్యార్థిని యాసిడ్ తాగి అస్వస్థతకు గురైన ఘటన మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నది. నారాయణఖేడ్ ప్రాంతంలోనే తల్లిదండ్రులకు దగ్గరగా ఉండి చదువుకుంటానని చాలా సార్లు చెప్పింది. కానీ, తల్లిదండ్రులు వినకపోవడంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం

### గాంధీ దవాఖానలో చికిత్స

బాత్‌రూమ్‌లు శుభ్రం చేసే యాసిడ్‌ను తాగింది. వెంటనే సహచర విద్యార్థినులు, ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ దవాఖానకు పంపించారని, ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## 'మల్లన్న' ఆలయ పాచకుడు మృతి

చేర్యాల, జూన్ 30 : కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని నిత్య ప్రసాద వితరణశాలలో పాచకుడిగా విధులు నిర్వహిస్తున్న జాలిగామి నిరంజన్ (50) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీంతో ఆలయ ఈవో అలూరి బాలాజీశర్మ కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.